
ధారూరు: పంట పొలాల్లో ఇసుక మేటలు

జల దిగ్బంధంలో మహాలింగేశ్వరాలయం

బషీరాబాద్ మండలంలో కాగ్నా నది ఉప్పొంగి ప్రవహించడంతో జీవన్గిలోని మహాదేవ లింగేశ్వర ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. రాత్రి కురిసిన భారీ వర్షాలకు కాగ్నానది ఉప్పొంగింది. నదిలో నీటి మట్టం పెరగడంతో ఆలయం చుట్టూ వరద చుట్టు ముట్టింది. కాగ్నా నది పక్కన నిలిపిన ఓ స్కూల్ బస్సు వరద నీటిలో కొట్టుకుపోకుండా ముందు జాగ్రత్తగా తాడుతో కట్టేశారు. అలాగే తాండూరు మండలంలోని గోనూరు శివారులో ఒకవైపు కాగ్నా నది, మరోవైపు ఎల్లమ్మ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వీరిశెట్టిపల్లి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. రెండు వైపులా వరద నీరు గ్రామంలోకి ప్రవహించడంతో వీరిశెట్టిపల్లికి ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో నంగెం కలాన్ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి వికారాబాద్ జిల్లా అతలాకుతలమైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జామువరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది. పలు చెరువులు, ప్రాజెక్టులు అలుగు పారాయి. పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వేల ఎకరాల్లో పంటలు జలమయం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో సగటు వర్షపాతం 66.9 మి.మీ. నమోదుకాగా అత్యధికంగా పరిగిలో 12.7 సెం.మీ వర్షపాతం నమోదైంది.


పరిగి: పొంగి పొర్లుతున్న లక్నాపూర్ ప్రాజెక్టు

వర్షపాతం వివరాలు (మి.మీలలో)

దోమ	118.5
పూడూరు	97.5
ధారూరు	97.5
వికారాబాద్	79.7
కొడంగల్	75.2
బషీరాబాద్	73.7
యాలాల్	71.5
దుద్యాల్	68.0
చౌడాపూర్	68.0
తాండూరు	65.4
నవాబ్‌పేట	64.7
కులకచర్ల	64.5
బొంరాస్‌పేట్	59.7
పెద్దేముల్	48.2
దౌల్తాబాద్	44.4
కోట్‌పల్లి	36.3

- అలుగెత్తిన చెరువులు, ప్రాజెక్టులు
- అత్యధికంగా పరిగిలో 12.7 సెం.మీ. వర్షపాతం
- జల దిగ్బంధంలో జీవన్గి మహాలింగేశ్వర ఆలయం
- పది వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

వాన బీభత్సం

రాత్రంతా కుండపోత.. ఉప్పొంగిన వాగులు, వంకలు


బషీరాబాద్: జలదిగ్బంధంలో శ్రీ మహాదేవలింగేశ్వరాలయం


కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో కూలిన ఇల్లు


దారూరు: అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్ట్

వికారాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరద ఉధృతికి బొంరాస్‌పేట్ నుంచి తుంకిమెట్లకు వెళ్లే మార్గంలో కొత్తగా చేపట్టిన రోడ్డు నిర్మాణం కోసం తాత్కాలికంగా వేసిన రోడ్డు తెగిపోయింది. మహంతిపూర్ నుంచి బొంరాస్‌పేట్‌కు వెళ్లే మార్గంలో కక్రవేణి వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మదన్‌పల్లి, బురాన్‌పూర్ మార్గంలోనూ అదే పరిస్థితి ఎదురైంది. రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో దోమ మండలంలో బ్రాహ్మణపల్లి - గంజిపల్లి గేట్, ధారూరు మండలంలో రుద్రారం - నాగసమందర్, దుద్యాల మండలంలో కుదురుమళ్ల - ఇండాపూర్, దోమ మండలంలో దోమ - పాలేపల్లి మధ్య, కులకచర్ల మండలంలో రాంనగర్ వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుపాకుల తండా వద్ద రోడ్డు తెగిపోయింది. దౌల్తాబాద్ మండలంలో నందారం నుంచి కొడంగల్ వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న రోడ్డు వంతెన పక్కన వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు మండలంలో బొంకూర్ - బిజ్వార్, తాండూరు - కొడంగల్ మార్గంలో యాలాల్ మండల పరిధిలో ఇస్నాపూర్ - యాలాల్ మధ్యలో కాగ్నా నది ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలు ఆగిపోయాయి. కోకట్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో నాలుగు గంటలపాటు రాకపోకలు నిలిచాయి.


పెద్దేముల్: ఇందూరు వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అలుగెత్తిన కోట్‌పల్లి ప్రాజెక్టు

కుండపోతగా కురిసిన వర్షానికి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగెత్తి ప్రవహించింది. బుధవారం రాత్రి వరకు ప్రాజెక్టు అలుగు వరకు చేరుకున్న నీరు రాత్రంతా కురిసిన వర్షానికి తెల్లవారుజామున అలుగు పారింది. జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టులతోపాటు పలు చెరువుల్లోకి భారీగా నీరు చేరుకుంది. ధారూరు, కొడంగల్, పరిగి, బొంరాస్‌పేట్ మండలాల్లో నాలుగు చెరువులు, కుంటలకు గండ్లు పడ్డాయి.

ఇళ్లల్లోకి చేరిన నీరు

దంచికొట్టిన వానకు వికారాబాద్, కొడంగల్, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వికారాబాద్ పట్టణంలో పాత పోస్టాఫీసు ప్రాంతంలో ఇళ్ల మధ్య వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు

మిగతా 8వ పేజీలో..

సాగునీటి వనరులకు | జలకళ 7లో


కొడంగల్: నందారం వద్ద తెగిన రోడ్డు


పూడూరులో నీట మునిగిన పత్తి చేను


బషీరాబాద్: కాగ్నా నదిలో కొట్టుకుపోకుండా బస్సుకు తాడు కట్టిన దృశ్యం



సహకారం పొడిగింపు

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాలకవర్గాలు
- జిల్లాలో 29 సహకార సంఘాలు

తాండూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పాలకవర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. మరో ఆరు నెలలు పదవీ కాలాన్ని పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని 29 పీఏసీఎస్‌ల పాలకవర్గాలు 2026 జనవరి 14 వరకు కొనసాగనున్నాయి. దీంతో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆరు నెలలుపాటు పొడిగించిన ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతుండటంతో పాలకవర్గాలను రెండోసారి పొడిగించింది. ప్రభుత్వ నిర్ణయం సహకార సంఘాల బలోపేతానికి, రైతుల సేవలకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు భావిస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎల్మకన్నె, బషీరాబాద్ మండలం నవాంద్గి, పెద్దేముల్ మండలంలో తట్టేపల్లి, పెద్దేముల్, కోట్‌పల్లి మండలంలో కోట్‌పల్లి, యాలాల మండలంలో యాలాల, లక్ష్మీనారాయణపూర్‌లో పీఏసీఎస్‌లు ఉన్నాయి.

రైతులకు మరింత మేలు



గతంలో పాలకవర్గాలకు పొడిగింపు ఎప్పుడూ జరుగలేదు. ఈ అవకాశం మాకు లభించింది. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రైతులకు రుణాలతోపాటు మర్ని సౌకర్యాలు కల్పించవచ్చు. పదవీ కాలాన్ని పొడిగించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. సహకార సంఘాల్లో మరిన్ని సంఘాలను విలీనం చేస్తే ఆ సంఘాలకు కూడా చేయూతనందిస్తాం.

- వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, బషీరాబాద్(నవాంద్గి)

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్
7

పంద్రాగస్టుకు పక్కా ఏర్పాట్లు

- ముస్తాబైన మేడ్చల్ కలెక్టరేట్
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కేశవరావు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి


స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంద్రాగస్టు వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వేడుకలకు కలెక్టరేట్‌ను ముస్తాబు చేశారు. వేడుకలకు ప్రభుత్వ సలహాదారు కేశవరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల పంపిణీలో భాగంగా ఆయా శాఖల అధికారుల సమాచారాన్ని కలెక్టరేట్‌కు పంపించారు. మహిళా సంఘాలకు రుణాలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. వేడుకల నిర్వహణకు పలు శాఖల అధికారులకు కలెక్టర్ మనుచౌదరి బాధ్యతలు అప్పగించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి తదితరులకు పలు సూచనలు చేశారు. ప్రొటోకాల్ నిర్వహణలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ విజయకుమారి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించామని, వరదముప్పు ఉన్న చోట్ల ప్రజలను అప్రమత్తం చేసి ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు రాధికాగుప్త, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ పాల్గొన్నారు.

వేడుకలకు వేళాయె

స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా స్పీకర్ ప్రసాద్‌కుమార్


కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

వికారాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం(ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్) ఆవరణలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆయన జాతీయ పతాకం ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేయనున్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా ఉత్తమ సేవా అవార్డుల ప్రదానం జరగనుంది. జిల్లాలో అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ మైదానంలో కాకుండా కార్యాలయం ఎదురుగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


నవాబుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి రాజారత్నం అన్నారు. గురువారం నవాబుపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో అనురాధతో కలిసి తనిఖీ చేశారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.


మెనూను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

బీజేపీ జిల్లా కార్యవర్గం నియామకం

వికారాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎట్టకేలకు బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి నియామకం జరిగి చాలా రోజుల తర్వాత ఆరుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఆరుగురు కార్యదర్శులు, కోశాధికారి, కార్యాలయ కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్‌చార్జి, మీడియా కన్వీనర్, ఐటీ ఇన్‌చార్జిలను పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి నియమిస్తూ బుధవారం రాత్రి ప్రకటన చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీధర్ రెడ్డి, కె.వివేకానందరెడ్డి, గడిగె శివరాజ్, పటేల్ సాయిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, ఐనాపూర్ యాదయ్యలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా పెంటయ్య గుప్తా, పటేల్ విజయకుమార్, రాయిపల్లి మాధవి నియామకం కాగా, జిల్లా కార్యదర్శులుగా బంట్వారం లావణ్య, లక్ష్మణ్, జుంటుపల్లి వెంకట్, హరికృష్ణ యాదవ్, రఘుపతి, అంగోత్ శంకర్‌నాయక్‌లు నియమితులయ్యారు. కోశాధికారిగా హన్మంత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా విజయలక్ష్మి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా టి.రాఘవేందర్, మీడియా కన్వీనర్‌గా టి.మోహన్‌రెడ్డి, ఐటీ ఇన్‌చార్జిగా ఎం.రవీందర్‌ను నియమించారు.

కానిస్టేబుల్‌కు ఇండియన్ గ్రేట్ అచీవ్‌మెంట్ అవార్డు


రాజునాయక్

చౌడాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కాట్రావత్ రాజునాయక్ ఇండియన్ గ్రేట్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. మూడేళ్ల క్రితం ప్రాణాలను లెక్క చేయకుండా దొంగలను పట్టుకోవడంతో అవార్డుకు ఎంపికయ్యారని గ్రామస్తులు తెలిపారు.

శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహణతో లాభాలు


మహిళా రైతులకు పాల ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, ఫౌండేషన్ సభ్యులు

షాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహిస్తే పాడి రైతులు అధిక లాభాలు పొందొచ్చని మాజీ రిజిస్ట్రార్ పశువైద్య విశ్వవిద్యాలయం డాక్టర్ కొండల్‌రెడ్డి, ఫార్మర్ డీన్ ప్రొఫెసర్ రఘునందన్ అన్నారు. గురువారం కక్కులూర్‌లో పీవీ.నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ వర్సిటీ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్దతిలో డెయిరీ సాగు మరియు పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులతో ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపించి, పశుపోషణ, ఆవుల గదుల నిర్మాణం తక్కువ పెట్టుబడితో లాభాలు పొందాలన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార నైపుణ్యాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ శివకుమార్, సాహిత్యరాణి మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి ద్వారా కోవా, పనీర్, చన్నా, రసమలై, బసుందీ, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్‌మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై రైతులకు వివరించారు. అనంతరం మహిళా పాడిరైతులకు ధ్రువీకరణ ప్రతాలందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి స్రవంతి, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగవంతం చేయాలి


హైవే అధికారితో చర్చిస్తున్న ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగులైన్ల జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని తన నివాసంలో గురువారం ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసు విషయంపై చర్చించారు. కేసు వేసిన వారిని ఒప్పించామని, ఎలాంటి అడ్డంకులు లేకుండా తాము చూస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన


రాస్తారోకో చేస్తున్న నాయకులు

పరిగి,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పోడు భూములను రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్ళిన బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ, గురువారం సాయంత్రం పరిగి బస్టాండ్ రోడ్డుపై రాస్తారోకోను నిర్వహించారు. పోడు రైతులు తమ హక్కుల కోసం ప్రజాభవన్‌కు వెళుతున్న వారికి మద్దతుగా నిలిచిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిపిపల్ ఛైర్మన్ అశోక్, సురేందర్, ఆర్.ఆంజనేయుల ఉన్నారు.

పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ ప్రజలు తమ ఇంటి వాణిజ్య పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. దేవరయంజాల్‌లో గురువారం సాద నాగేందర్‌రెడ్డి వాణిజ్య సముదాయాల పన్నులు రూ.3,39,812 చెల్లించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావన్ కుమార్, బిల్ కలెక్టర్ రాంరెడ్డి, సాద నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ఎంపీకి ఆలయ చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్ అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని గురువారం ఆయన దర్శించుకున్నారు. అర్చకులు ప్రమోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. మరకత శివలింగాన్ని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. శివయ్య స్వామి దీవెనలు ప్రలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మరోసారి కుటుంబీకులతో వచ్చి స్వామిని దర్శించుకుంటానని తెలిపారు. ఆలయ కమిటీఛైర్మన్ గోపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు సదానంద్‌గౌడ్‌లు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా విజయవంతం


జెండాలను అందజేస్తున్న అందె బాబయ్య, నాయకులు

షాద్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతమైందని బీజేపీ నేతలు ప్రకటించారు. గురువారం తిరంగా ఇన్‌చార్జి చెట్ల వెంకటేశ్ నేతృత్వంలో షాద్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి పట్టణ కూడలి వరకు అన్ని వాణిజ్య సముదాయాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అందె బాబయ్య మాట్లాడుతూ.. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేదుకు తిరంగా కార్యాక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు హరిభూషణ్,యువ మోర్చా నాయకులు ప్యాట అశోక్, వంశీకృష్ణ, రుషికేష్, కురుమన్న, ప్రవీణ్, మంగాదేవి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్ తెలిపారు. నూతనంగా ఎంపికైన శంకర్‌పల్లి మండల, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా శంషాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, భయానంద్, వాసుదేవ్, దయాకర్‌రెడ్డి. నాయకులు నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో ప్రభుత్వ చీఫ్‌విప్

పెద్దేముల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ తండాలో శ్రీవీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దేముల్‌తండాలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ నూతనంగా శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మింపజేశారు. రెండురోజుల పాటు కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొదటిరోజు జరిగిన హోమంలో మహేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, జితేందర్‌రెడ్డి,డీవై.నర్సిములు, ప్రవీణ్‌కుమార్, మాజీఎంపీటీసీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పూడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చిన్నబండతండా హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. దైవదర్శనంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. మాజీ ఎంపీపీ మల్లేశం, నర్సింహారెడ్డి, గోపాల్, అంజనేయులు ఉన్నారు.

జలమయం.. కొత్తూర్ అండర్‌పాస్

● వాహనచోదకుల ఇబ్బందులు


కొత్తూర్ అండర్‌పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు

కొత్తూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు కొత్తూర్ సమీప అండర్‌పాస్‌లో నిలిచిన నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్మించిన అండర్‌పాస్‌లో భారీగా వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల డిజైన్ లోపంతో తరచూ వాన నీరు నిలుస్తుండడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. వర్షపు నీరు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసినా అవి పూర్తిస్థాయిలో పనిచేయడంలేదు. ఇటీవల పలు వాహనాలు వర్షపునీటిలో చిక్కుకోవడంతో స్థానికుల సహాయంతో వాటిని బయటకు తీశారు. కొత్తూర్ వై-జంక్షన్‌లో ప్రమాదాలను నివారించేందుకు వై-జంక్షన్ సమీపంలో అండర్‌పాస్ నిర్మించారు. అండర్ పాస్ నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. అయితే వానకాలంలో అండర్‌పాస్ మొత్తం నీటితో నిండుతుంది. వాహనదారులు రాత్రిపూట మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వర్షపు నీటిని తోడించేందుకు భారీ మోటార్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గోధుమగూడ వద్ద వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్ మండలం గోధుమగూడలో పరిశీలించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, చెరువులు, కాలువల వద్ద వెళ్లరాదని తెలిపారు. రైల్వే బ్రిడ్జి దగ్గర నీటి ప్రవాహం తగ్గే వరకు రాకపోకలను నిలిపి వేయాలని అధికారులకు ఆదేశించారు. వాతావరణ శాఖ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో దయానంద్, పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి


మాట్లాడుతున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పనిచేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలు, ఫీల్డ్ ఆఫీసర్లు సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తే ఫంక్షన్ హాల్స్‌ను సిద్ధంచేయాలని ఆదేశించారు. పశువులకు వ్యాధుల రాకుండా వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పురాతన ఇళ్లు, పాఠశాలలు, హాస్టళ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలని సూచించారు. చెరువులు, ప్రాజెక్టుల లీకేజీలుంటే వెంటనే పూడ్చి వేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ఫిషర్‌మెన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో కాజ్‌వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎక్కడ సమస్యొచ్చినా రెండు బృందాలు రోప్‌తో సిద్ధంగా ఉంటాయని వివరించారు.

ఉత్సవాలకు రాధాకృష్ణాలయం ముస్తాబు


గుట్టపై రాధాకృష్ణ ఆలయం; కొలువు దీరిన రాధాకృష్ణుల మూలవిరాట్

కడ్తాల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలాజీనగర్ తండా సమీప ధనరాశి పర్వతంపై వెలసిన రాధాకృష్ణ ఆలయం గోకులాష్టమి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి నిర్వహించే వేడుకల నిర్వాహకుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 16న రాత్రి డోలోత్సవం, భజనలు, క్షీరాభిషేకం, సుదర్శన యాగం, 17న ఉట్ల వేడుకలు ఉంటాయని ధర్మకర్త తెలిపారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు, తీజ్ వేడుకలు ఉంటాయని, ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాధాకృష్ణుల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రొటోకాల్ పాటించకుంటే అడ్డుకుంటాం


విలేకరులతో మాట్లాడుతున్న కండె హరిప్రసాద్

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాల వలె నిర్వహిస్తూ రాజకీయ లబ్ధికి, అధికారి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ ఆరోపించారు. ఇకపై అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌ను పాటించకుంటే అడ్డుకుంటామని అన్నారు. ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో బీసీ బాలుర హాస్టల్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులే నిర్వహించుకున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పేరును శిలాఫలకంపై రాయడం ఏమిటని అభ్యంతరం తెలిపారు. అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చి ఓ మాజీ ప్రజాప్రతినిధి పేరును రాయించారని విమర్శించారు. పీసీబీ మెంబర్ పదవి పోయి ఏడాదైనా అదే హోదాతో బాలాజీసింగ్ పేరును చేర్చడం సరికాదన్నారు. ఈ విషయమై గవర్నర్, కలెక్టర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తామని హరిప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, మాజీ కౌన్సిలర్లు చెన్నకేశవులు, చెక్కాల లక్ష్మణ్, పద్మప్రశాంత్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో తిరంగా ర్యాలీ


ఇబ్రహీంపట్నంలో తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దేశం, సమాజం పట్ల గౌరవంగా మెలగాలని బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల బాస్కర్, నాయిని సత్యనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధిస్తోందన్నారు. రక్షణ రంగం విషయంలో ప్రభుత్వ చర్యలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జె.రవీందర్‌రెడ్డి, టి.రాంరెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్, సంతోస్, సురేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో.. నేటి నుంచి పవిత్రోత్సవాలు



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మహా కుంభప్రోక్షణ, పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో నేటి నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రోజూ పూజలు, హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి చివరి రోజు సాయంత్రం వేంకటేశవర స్వామి కల్యాణం జరిపిస్తారు. వేంకటేశ్వరుడి విగ్రహాన్ని తిరుమల తిరుపతి శిల్ప కళాశాల నుంచి తెచ్చి 1999 ఆగస్టు 17న పునఃప్రతిష్ఠించారు. 25ఏళ్లు అవుతున్నందున పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు.

సాగునీటి వనరులకు జలకళ

చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద | **అలుగెల్లిన కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు**

అలుగెత్తుతున్న చెరువులు	: 311
75 నుంచి 100 శాతం నిండినవి	: 294
50 నుంచి 75 శాతం నిండినవి	: 371
25 నుంచి 50 శాతం నిండినవి	: 211
మొత్తం చెరువులు	1,187

● మూడడుగుల దూరంలో నందివాగు


అలుగు పారుతున్న ధారూరు మండంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు

వికారాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భారీగా నీరు చేరి చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు అలుగెత్తుతున్నాయి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు మత్తడి దుంకుతునాన్నాయి. జిల్లాలో 1,187 సాగునీటి వనరులుండగా, వాటిలో 311 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. మిగతా చెరువుల్లో 75శాతం నుంచి కనీసం 25శాతం వరకు నీరు చేరాయి. లక్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి, కాక్రవేణివాగు ప్రాజెక్టులు ఇప్పటికే అలుగు పారాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు నిండాయి. నందివాగు ప్రాజెక్టు మరో ఒకటి, రెండు వర్షాలకు నిండే అవకాశం ఉంది. సర్పన్‌పల్లి ప్రాజెక్టు 18 అడుగులు, శివసాగర్ 9, అల్లాపూర్ 10, కొంశెట్‌పల్లి 8, కాక్రవేణివాగు ప్రాజెక్టు 14.7, కోట్‌పల్లి ప్రాజెక్టు 24, జుంటుపల్లి శ్రీరాముల వారి ప్రాజెక్టు 22 అడుగుల లోతుండగా.. ఇవన్నీ అలుగెత్తాయి. నందివాగు ప్రాజెక్టు పూర్తి నీటి నిలువ 16 అడుగులు కాగా.. 13 అడుగుల మేర నీరు చేరింది.

మత్తడి దుంకిన చెరువులు

వికారాబాద్, నవాబ్‌పేట, ధారూరు మండలాల్లో 152 చెరువులకు 98 చెరువులు అలుగెల్లాయి.పెద్దేముల్, తాండూరు, బంట్వారం మండలాల్లో 104 చెరువులకు 30చెరువులు మత్తడి దూకాయి. మిగతా చెరువుల్లోనూ భారీగా నీరు చేరింది. బషీరాబాద్, యాలాల్ మండలాల్లో 158 చెరువులకు 90 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. కోట్‌పల్లి, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల పరిధి 165 చెరువులకు గాను 50 చెరువులు అలుగు పారుతున్నాయి. పూడూరు, పరిగి, కులకచర్ల, దోమ, చౌడాపూర్ మండలాల పరిధిలో 401 చెరువులకు గాను 26 చెరువులు అలుగెత్తాయి. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల్లో 207 చెరువులుండగా, 17 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి.

రెండు చెరువులకు గండ్లు

ఇదిలా ఉంటే వర్షాలకు సాగునీటి వనరులపై అధికార యంత్రాంగం నిఘా పెంచింది. వరద ఉధృతికి చెరువుల వద్ద ప్రమాదకర ఘటనలు చోటుచేసుకోకుండా సమాచారాన్ని సేకరిస్తున్నారు. చెరువు కట్టలకు గండ్లు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు జిల్లాలో యాలాల, ధారూరు మండలాల్లో రెండు చెరువులకు గండి పడింది.

ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ కొండంత అండ


లబ్ధిదారులకు ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కొందుర్గు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు కొండంత అండగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం కొందుర్గులో లబ్ధిదారులకు ఎల్వోసీలు అందజేశారు. పేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే వారికి వైద్య ఖర్చులను అందించేందుకే సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఎం.రవీందర్‌రెడ్డి, రాజేష్‌పటేల్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, నర్సింహులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మొయినాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):గ్రామీణ భారతాన్ని శక్తివంతం చేయడమే లక్ష్యంగా కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొయినాబాద్ పరిధి చిలుకూరు ఎల్‌ఎన్‌ఆర్ పాఠశాలతో పాటు మండలంలోని తోలుకట్ట, నక్కలపల్లి, శ్రీరామ్‌నగర్, సజ్జన్‌పల్లి, ఎత్‌బార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు తయారుచేసిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజాభివృద్ధికి అవసరమైన ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఉన్నత భారత్ అభియాన్ ద్వారా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధ్యాపకులు సంయుక్తమోహన్ తెలిపారు. పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య


కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన అసంపూర్తి పనులు త్వరగా పూర్తిచేయించి వినియోగంలోకి తెస్తామని అన్నారు. జూనియర్ కళాశాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. కళాశాల గదులు, ఆవరణ, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలలో జూనియర్, డిగ్రీ కళాశాలలు కొనసాగుతుండడంతో గదుల కొరతతో ఇబ్బందులు కలుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా భవన సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్థానికుల సహకారం, ఉపాధ్యాయులు, అధ్యాపకుల పనితీరుపైనే విద్యా సంస్థల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చి దిద్దాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, టీచర్స్ యూనియన్ నాయకుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుర్రం కేశవులు, కాలె మల్లయ్య, మండ్లీ రాములు, కె.శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, కృష్ణనాయక్, సురేశ్, పి.శ్రీకాంత్, టి.రవీందర్, పి.శ్రీశైలం, జగన్, మానయ్య, మల్లేశ్, బాబ, శివకుమార్, శ్రీను, వెంకట్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలి

కొడంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎరన్‌పల్లి శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి భూములు ఇచ్చిన కొంత మంది రైతులకు పూర్తి స్థాయి పరిహారం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం సర్వే నంబరు 19లో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ నెల 16న మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మాణంలో భాగంగా శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిసిందని అన్నారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా పూర్తిస్థాయి పరిహారం అందించాలని, ఆ తర్వాతే పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేద్దాం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు


షాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేద్దామని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం షాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్ ఏరియాలో జరుగుతాయన్నారు. కార్మికులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, శ్రీశైలం, సత్తిరెడ్డి, నాయకులు మంజుల, జంగయ్య, రఘురాం, మధు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలి


తిరంగా ర్యాలీలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, నాయకులు

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీని గురువారం శంకర్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భక్తిని కలిగి ఉండి దేశసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని అన్నారు. రాబోయే తరాలకు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రతాప్‌రెడ్డి. వాసుదేవ్, శ్రీనివాస్‌రెడ్డి. మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి. నర్సింలు, దయానంద్, క్రిష్ణారెడ్డి, బీర్ల సురేష్, బండ వెంకటయ్య, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సిద్ధులగుట్ట సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


వెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయం


గర్భగుడిలోని శివలింగం

శంషాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్ధులగుట్ట) ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే బ్రహోత్సవాలు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ శ్రావణమాస చివరి వారంలో ఈ ఆలయంలో 11రోజులు జాతర నిర్వహిస్తారు. 450 సంవత్సరాల క్రితం శంషాబాద్, రాళ్లగూడ, కవ్వగూడ, కొత్వాల్‌గూడ, చుట్టూర 50కిలోమీటర్ల పరిధిలో కరువు ఏర్పడింది. అంతుపట్టని వ్యాధులతో ప్రజలు మృత్యువాతపడ్డారు. అదే సమయంలో కాశీయాత్ర చేసి ఈ ప్రాంతంగుండా వెళ్తున్న సిద్దుడు అనే మునీశ్వరుడిని ప్రజలు వేడుకోగా రాళ్లగూడ నుంచి కొత్వాల్‌గూడ వరకు మూడు కిలో మీటర్ల దూరం వరకు విస్తరించిన పాలరా తిగుట్టల్లో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడు. ఆ వెంటనే ఈ ప్రాంతంలో నాలుగు రోజులు వర్షాలు కురిశాయి. ప్రజలకు క్రమేనా రోగాలు తగ్గిపోయాయి. సిద్ధుడు ప్రతిష్ఠించి ఆలయం కాబట్టి సిద్ధేశ్వస్వామిగా కొలుస్తున్నారు. శుక్రవారం మహారుద్రాభిషేకంతో ప్రారంభమై 18న అమృతస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వాగు పరిసరాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు


లింగంధన సమీపంలో పెద్దవాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య తదితరులు

కేశంపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దవాగు ఉధృతంగా పారింది. వాగు పరిసర పాటిగడ్డ, కేశంపేట, లేమామిడి, కాకునూర్, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, లింగందన గ్రామాల్లో వాగుదాటే చోట్ల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జీ ఎంపీడీవో కిష్టయ్య గ్రామాల్లో పర్యటించి రక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కేశంపేట తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మూడు రోజులు కంట్రోల్ రూం కొనసాగుతుందని తహసీల్దార్ ఆజం అలీ తెలిపారు. 15వ తేదీ నుంచి 16 వరకు సీనియర్ అసిస్టెంట్ మశ్చేందర్(7799363553), జూనియర్ అసిస్టెంట్ శివ(9398094490), 17న ఆర్ఐ చెన్నకేశవులు(9948044523), రికార్డ్ అసిస్టెంట్ జంగయ్య(9972170411), 18న జూనియర్ అసిస్టెంట్లు మహేశ్, జంగేష్‌లు ఫోన్ నంబర్లు 9442579527, 9848206029లలో అందుబాటులో ఉండి సేలందిస్తారని తెలిపారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం


ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మహేష్ గౌడ్, రాదాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, ఎం వెంకటేష్, ముత్యాలు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కు విద్యార్థుల ఎంపిక


లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తున్న డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజనాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సమక్షంలో గురువారం కలెక్టరేట్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లకు లాటరీ తీశారు. ఆరు సీట్లలో ముగ్గు బాలికలు, మరో ముగ్గురు బాలురు ఉన్నారు. లంబాడా 4, ఎరుకల 1, ఇతర తెగలకు 1 కేటాయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.


చౌడాపూర్: అలుగు పారుతున్న కన్మాన్ కాల్వ చెరువు

దంచికొట్టిన వాన

వికారాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది. చెరువులు, ప్రాజెక్టులకు భారీగా వరదనీరు చేరింది. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వివిధ పంటలు నీట మునిగాయి. వర్ష ప్రభావిత ప్రాంతాలను అధికారులు, నాయకులు సందర్శించి తగు చర్యలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 14

● వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలు ● ఉప్పొంగిన వాగులు, వంకలు ● చెరువులు, ప్రాజెక్టులకు చేరిన భారీ వరద ● నీట మునిగిన పంటలు

వాన బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)

గురయ్యారు. పరిగి బీసీ కాలనీలో ఇళ్ల మధ్య భారీగా వరద నీరు చేరింది. కొడంగల్‌లో బాలాజీనగర్‌లో ఇళ్లలోకి వరదనీరు చేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.

వేల ఎకరాల్లో పంటలు జలమయం

కుండపోతగా కురిసిన వర్షాలకు జిల్లాలో సుమారు పది వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న, పసుపు, కంది, తదితర పంటలు జలమయమయ్యాయి. కాగ్నా, మూసీ నదులతోపాటు ఇతర వాగుల పరీవాహక ప్రాంతాల్లోని పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. కూరగాయ పంటలకు చాలా వరకు నష్టం వాటిల్లింది.

పలు ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ ప్రతీక్ జైన్

జిల్లాలో వర్ష ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించారు. కోకట్ వద్ద కాగ్నా బ్రిడ్జి, బొంరాస్‌పేట్ చెరువు, కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిపై ఆరా తీశారు. పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో మార్గ మధ్యంలో వాగులు, రోడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర వర్ష ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

వాతావరణ శాఖ వికారాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదనపు కలెక్టర్లతో పాటు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులను రంగంలోకి దించి వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై నుంచి పొంగి ప్రవహించే వరద నీటిలో నుంచి ఎవరూ దాటకుండా బారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను రక్షణగా ఉంచారు.


కులకచర్ల: రాంనగర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


పరిగి: రంగాపూర్‌లో నీటిలో మునిగిన పత్తిచేను


ధారూరు: గురుదోట్ల చెరువు కట్ట తెగి దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో సంజూ రాథోడ్


కొడంగల్ రూరల్: కొడంగల్ పెద్ద చెరువు కింద కాల్వలో చేపలు పడుతున్న యువకులు


దోమ: బాసుపల్లి గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటను చూపిస్తున్న రైతు మహిపాల్

ధారూరు: అంతారం సమీపంలో వరద నీటిలో పత్తిచేను




మోమిన్‌పేట్: నందివాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్ఈ మధుసూదన్‌రెడ్డి, డీఈ భాస్కర్‌గౌడ్

ధారూరు: తెగిన గురుదోట్ల చెరువు కట్టను పరిశీలిస్తున్న బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నందు



తాండూరు: పాతకుంటలో జోరు వర్షంలో రోడ్డుపై నీరు నిలవకుండా మున్సిపల్ సిబ్బంది పనులు




దుద్యాల: కంది పొలంలో చేరిన వరద నీరు

కొడంగల్: పెద్దనంది గామ, నీటూర్ మధ్యలో వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు




బొంరాస్‌పేట్: మూడు మామిళ్ల తండా శివారులో భారీ వర్షానికి తెగిన కాలువ



బషీరాబాద్: నవాంద్గీ శివారులో నీట మునిగి చెరువును తలపిస్తున్న పత్తి చేను


దుద్యాల: సంగాయిపల్లి కొత్త చెరువు అలుగు పారుతుండటంతో పరిశీలిస్తున్న ఎస్ఐ యాదగిరి


ధారూరు: తెగిపోయిన గురుదోట్ల చెరువు కట్ట



దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్‌లో పత్తిచేనులో నిలిచిన వరద నీరు

ఎంపీడీవో కూతురు వివాహానికి ఎమ్మెల్యే హాజరు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల ఎంపీడీవో విశ్వప్రసాద్ కూతురు శివాని, రోహిత్‌కుమార్ వివాహం హైదరాబాద్ బీరంగూడ అర్సీపురంలోని శ్రీబాలాజీ గ్రాండ్ కన్వెన్షన్‌లో గురువారం ఘనంగా జరిగింది. ఈ వివాహానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జర్నె నాగప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ మత రాజకీయాలు

ఘట్‌కేసర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలో మతం పేరుతో రాజకీయాలు చేస్తూ అన్ని వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కట్లూరి జయచంద్ర, సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ ఆరోపించారు. పోచారం మున్సిపాలిటీల పరిధిలో వివిధ కాలనీల్లో గురువారం ఈనెల 19నుంచి 22వరకు నాలుగు రోజుల పాటు జరిగే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదాశివ, లత, రేణుక, సాంబశివ, రమేష్, చింటూ పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయించండి

తాండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం వార్డు నంబర్ 36లో ఏడాదిగా మురుగు కాల్వను శుభ్రం చేయడంలేదని కాలనీవాసులు గురువారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో వీధికుక్కల బెడద విపరీతమైందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఆందోళన చేపడతామని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు ఎస్.వెంకటేష్, నవీన్, శ్రీనివాస్, ఎన్.రాములు, తదితరులు ఉన్నారు.

మార్వాడీ యువమంచ్ చేయూత

తాండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంచానికి పరిమితమైన వ్యక్తికి తాండూరు మర్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. సాయిపూర్ ప్రాంతానికి చెందిన కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగి బ్రెయిన్ ఆపరేషన్‌తో పక్షవాతానికి గురై మంచంపై ఉన్నారు. విషయం తెలుసుకున్న మార్వాడీ యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్‌సార్దా, తాండూరు మార్వాడీ యువమంచ్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంచ్ సభ్యులు మహేష్ పర్తాని, దినేష్ పర్తానిలు ముందుకు వచ్చి బాధితుడికి కమోడ్ వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షులు అనిల్‌సార్దా, కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్దా, మాజీ అధ్యక్షుడు సూర్యప్రకాష్ సోమాని, దినేష్ పర్తానిలు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



ఘట్‌కేసర్ రూరల్: ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం జరిగిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాతో సెల్ఫీలు దిగి ర్యాలీ నిర్వహించారు. ముగ్గుల పోటీల సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను ముగ్గులుగా వేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం డీన్ వసుధభక్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్-1 ఆఫీసర్ రాజేంద్ర కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: దేశభక్తిని ప్రతిఒక్కరూ చాటాలని బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. పరిగిలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనసూయ, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, అంజనేయులు, పెంటయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

నవాబుపేట: హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, జగన్, చంద్రకాంత్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, ఎస్సై పుండ్లిక్, ఎంపీడీవో అనురాధ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కేశవులు, నర్సింహ, మహిపాల్, అనసూయ, శ్యామ్ పాల్గొన్నారు.



నవాబుపేట: ర్యాలీలో నాయకులు, అధికారులు

స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబు

చౌడాపూర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెండా ఆవిష్కరణకు చౌడాపూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయలు ముస్తాబయ్యాయి. ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయశాఖ తదితర కార్యాలయాల ఆవరణల్లో తోరణాలతో ముస్తాబు చేశారు.

రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం

కొడంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కుమారుడు ర్యాగ అరుణ్‌కుమార్ అన్నారు. కర్ణాటకలోని దంతాపూర్ గ్రామంలో ఓకార్యక్రమానికి కొడంగల్ మీదుగా వెళ్తున్న ఆయన గురువారం కొడంగల్‌లో బీసీ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే వ్యవసాయం పైనే ఆధారపడకుండా పరిశ్రమల ఏర్పాటు కోసం, వ్యాపారాల వైపు పయనించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్, గోపాల్, కృష్ణ, రాఘవేందర్‌చారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ర్యాగ అరుణ్‌కుమార్

సంక్షిప్తంగా..

మందకృష్ణ పర్యటనను జయప్రదం చేయాలి

కులకచర్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 16న పరిగిలో పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఆనంద్ గురువారం మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని ముజాహిద్‌పూర్, అంతారం, బొంరెడ్డిపల్లి, బండవెల్కిచర్ల గ్రామాల్లో పర్యటించారు.

తిరుమలలో ద్యాచారం భజన మండలి

వికారాబాద్: ద్యాచారం గ్రామం నుంచి జై హనుమాన్ భజన మండలి వారు బుధవారం, గురువారం సాయంత్రం, ఉదయం తిరుమల తిరుపతిలో ద్యాచారంభజన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ జై హనుమాన్ భజన మండలి అధ్యక్షులు అనంతయ్య తెలిపారు.

పాపన్నగౌడ్ జయంతిని జయప్రదం చేద్దాం

కులకచర్ల: 18న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని జయప్రదం చేద్దామని మండల గౌడ సంఘం నాయకులు అన్నారు. గురువారం కులకచర్లలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాలే కృష్ణయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుమలాపూర్ రాములుగౌడ్, సంఘం సలహాదారు వెంకటయ్యగౌడ్‌తో సమావేశమయ్యారు.

కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

కులకచర్ల: మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.అంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్‌లో మహిళా సంఘాల సభ్యులతో గురువారం మాట్లాడారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, టీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ నాయక్, కార్యదర్శి సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

మోమిన్‌పేట్ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మోమిన్‌పేట్ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొడంగల్/దుద్యాల: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడంగల్, దుద్యాల తహసీల్దార్లు విజయ్‌కుమార్, కిషన్‌నాయక్ అన్నారు. రాబోయే 72 గంటల పాటు జిల్లాకు భారీ వర్ష సూచనను వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

కొడంగల్ రూరల్: టీబీ (క్షయ) వ్యాధి బారిన పడినవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని అంగడిరాయిచూర్ పాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బుస్రా ఫాతీమా సూచించారు. రావులపల్లిలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించి 111మందికి పరీక్షలు చేశారు.

విదేశీ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన

బషీరాబాద్: ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలలో ఈకో ఫాన్ సొసైటీ ప్రతినిధి విదేశీ కలుపు మొక్కలపై గురువారం అవగాహన కల్పించారు. ఈకో ఫాన్ సొసైటీ వ్యవస్థాపకులు మెట్టు సాయిసంపత్, తహసీల్దార్ షాహీదాబేగం, ఎంపీడీవో తిరుమలస్వామి, ఎస్ఐ నుమాన్‌అలీ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కులకచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 108 వాహన సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో ఆదేశాలతో 108 వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో మందులు, ఆక్సిజన్, వాహనం పనితీరు, రికార్డులను పరిశీలించారు.

ట్రాఫిక్ పోలీసుపై దాడి.. నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులను అసభ్యకరంగా దూషిస్తూ దాడికి పాల్పడిన నిందితున్ని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం. యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన పెన్నింటి అజయ్‌రెడ్డి(27) బుధవారం సాయంత్రం మద్యం సేవించి ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి యంనంపేట్ చౌరస్తాలో సిగ్నల్ దాటి ముందుకు వచ్చాడు. దీంతో అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కృష్ణ కారు వెనుకకు తీయాలని చెప్పడంతో దుర్భాషలాడుతూ కారులో నుంచి దిగి దాడికి యత్నించాడు. వీడియో చిత్రీకరిస్తున్న ఎస్ఐ విజయ్‌కృష్ణ ఫోన్ లాక్కొని పడేయడానికి యత్నించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అజయ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయంలో వెండి కిరీటాలు, బంగారు పుస్తెలు అపహరణ

చౌడాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మరికల్ గ్రామంలోని రామాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వెండి కిరీటాలు, అమ్మవారి బంగారు పుస్తెలు అపహరించుకెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా నవాబుపేట ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ ఆలయంలో ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. ఈ ఘటనలో చోరీకి గురైన ఆభరణాల విలువ దాదాపు రూ.3లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తాండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితిలో సేవలు అందించేందుకు తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 9110768664 నంబర్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని ఏ గ్రామస్థులైన సమాచారాన్ని ఈ నంబర్‌కు అందించాలని వర్షం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను తెలపాలని సూచించారు.

క్రైం కార్నర్

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

పెద్దేముల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నీటిగుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్తులు, మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మర్పల్లి అంజిలయ్య(45) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. అంజిలయ్య భార్య లక్ష్మీ తన సోదరుడికి రాఖీ కట్టేందుకు మంగళవారం భర్త, కూతురుతో కలిసి పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో మంబాపూర్‌లో ఉదయం 11గంటలకు బస్సు దిగిన అంజిలయ్య భార్యా కూతురును ఇంటికి పంపించాడు. అనంతరం అదే గ్రామంలో మద్యం సేవించి చైతన్యనగర్‌కు కాలినడకన బయల్దేరాడు. ఈ క్రమంలో మంబాపూర్ శివారు నుంచి చైతన్యనగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మీ ఫోన్‌చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో తన స్వగ్రామమైన కొండాపూర్ వెళ్లి ఉంటాడని భావించారు. గురువారం మంబాపూర్ శివారులో చైతన్యనగర్ గ్రామానికి కాలినడకన వెళ్లే దారిలో గల గుంతలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న అంజిలయ్య భార్య అక్కడికి చేరుకుని పరిశీలించి ఆ మృతదేహం తన భర్తదేనని గుర్తించి బోరున విలపించింది. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు.

కారు, టీవీఎస్ బైకు ఢీకొని మహిళ...

యాలాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కారు, టీవీఎస్ బైకు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన యాలాల మండలం కోకట్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పెద్దేముల్ మండలం కందనెల్లికి చెందిన పల్లె పద్మమ్మ(50) భర్త పల్లె అనంతప్పతో కలిసి టీవీఎస్ బైక్‌పై కోకట్ నుంచి తాండూరు వైపు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పద్మమ్మ మృతిచెందగా అనంతప్పకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్ఐ విఠల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కీసర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీర్యాల్ డబుల్ బెడ్ రూమ్‌లో నివాసముంటున్న జూపల్లి మహేశ్(52) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం మహేశ్ సరుకులు కొనేందుకు తన సైకిల్‌పై కీసరకు వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కీసర వెంకటసాయి థియేటర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈసీఐఎల్ నుంచి కీసరకు అతివేగంగా వస్తున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి మహేశ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహేశ్ తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా మహేశ్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిమెంట్ ట్యాంకర్ ఢీకొని మరొకరు..

తాండూర్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బైక్-సిమెంట్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాథోడ్ వినోద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్మకన్నె గ్రామానికి చెందిన షేక్ పాషా(60) బెల్కటూర్ సమీపంలోని సీసీఐ రైల్వే ట్రాక్ వద్ద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని తన బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో గోపన్‌పల్లి సమీపంలో గుర్తుతెలియని సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో షేక్‌పాషాకు తీవ్ర గాయాలై కింద పడిపోయాడు. తాండూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.